సాక్షి సిద్దిపేట

గురువారం । 29 । ఫిబ్రవరి । 2024



అనగనగా ఈరోజు

నాలుగేళ్లకోసారి వచ్చే లీపు సంవత్సరం (ఫిబ్రవరి 29) అంటే అందరూ ప్రత్యేక రోజుగా పరిగణిస్తారు. గురువారం లీపు సంవత్సరం సందర్భంగా ప్రత్యేక కథనం. వివరాలు 8లో ▸



జాగిలాల పనితీరు...

నేరస్తులను పసిగట్టడంలో పోలీసు జాగిలాల పనితీరు ప్రశంసనీయమని సీపీ అనురాధ తెలిపారు. జాగిలాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివరాలు 8లో ▸



ఆగుతూ.. సాగుతూ

చేర్యాలలో సమీకృత భవన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఆరేళ్లయినా పనులు పూర్తి కాకపోవడంతో సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఒకటి నుంచి తేనెటీగల పెంపకంపై శిక్షణ



ములుగు అటవీ కళాశాల

ములుగు(గజ్వేల్): అటవీ కళాశాల, పరిశోధన కేంద్రం(ఎఫ్‌సీఆర్‌ఐ)లో తేనెటీగల పెంపకంపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 1 నుంచి 7వ తేదీవరకు జరిగే ఈ శిక్షణలో ఆసక్తి గల రైతులు హాజరు కావచ్చన్నారు. శిక్షణలో పాల్గొనే వారికి తేనెటీగల పెంపకంలోని మెలకువలతో పాటు మార్కెటింగ్ తదితర అంశాలను బోధిస్తారన్నారు. ఇతర వివరాల కోసం 90593 64987 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బండి యాత్రను అడ్డుకోవద్దు

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేపడుతున్న ప్రజాహిత యాత్రను అడ్డుకోవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ కార్యకర్తలను కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను మళ్లీ మభ్యపెట్టడానికి యాత్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇంటర్మీడియెట్ పరీక్షల నేపథ్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించాల్సి ఉందన్నారు. బండి సంజయ్ మనస్తాపం కలిగేలా చేసిన వ్యాఖ్యలకు బాధపడినా, ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకూడదని కార్యకర్తలకు చేతులెత్తి నమస్కరిస్తున్నానని తెలిపారు.

యూరియా కొరత లేదు

జిల్లా వ్యవసాయాశాఖ అధికారి శివప్రసాద్



వివరాలు తెలుసుకుంటున్న వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్

చిన్నకోడూరు(సిద్దిపేట): వరి సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితేనే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ అన్నారు. బుధవారం చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో వరి పంటలను పరిశీలించారు. శివప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదన్నారు. యాసంగికి అవసరమైన యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. కాండం తొలిచే పురుగును గుర్తించడానికి దీపపు ఎర, సోలార్ దీపపు ఎర, లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలన్నారు. పిలక దశలో ఎకరాకు మూడు లింగాకర్షక బుట్టలను అమర్చాలన్నారు. చౌడు నేలల్లో నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఆన్‌లైన్‌లో క్రాఫ్ బుకింగ్ వివరాలను పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో ఏవో జయంత్‌కుమార్, ఏఈవోలు ప్రవీణ్, జమీల్, తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ ప్రదానం



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న వినయ్‌కుమార్

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేటకు చెందిన కాటం వినయ్‌కుమార్ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ స్నాతకోత్సవం పురస్కరించుకొని బుధవారం అవార్డుల ప్రదానం చేశారు. రంగస్థల కళాశాల (థియేటర్ ఆర్ట్‌కోర్స్) లో అత్యధిక మార్కులు సాధించడంతో మెడల్, సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాటాడుతూ తనను ప్రోత్సహించిన కళాశాల డీన్ హన్మంతరావు, వైస్ ఛాన్స్‌లర్, సబ్‌రిజిస్ట్రార్, అధ్యాపక బృందానికి ధన్యవాదాలు తెలిపారు.

పలువురు సీఐల బదిలీ

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ పోలీసు శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి రామగుండం టాస్క్‌ఫోర్స్ విభాగానికి బదిలీ అయ్యారు. సిద్దిపేట వన్ టౌన్ నూతన సీఐగా మల్టీజోన్ వన్ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న లక్ష్మణ్ బాబు రానున్నారు. అదేవిధంగా సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ మధు మధిర టౌన్ సర్కిల్‌కు, హుస్నాబాద్ సర్కిల్ సీఐ కిరణ్ సిద్దిపేట సీఎస్‌బీకి, సీఎస్‌బీ వన్ సీఐ సత్యనారాయణరెడ్డి మల్టీజోన్ వన్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, సిద్దిపేట పీసీఆర్‌లో ఉన్న సీఐ శివకుమార్‌ను వరంగల్‌కు కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మురుగు రహితమెప్పుడో?

నిలిచిపోయిన కొత్త కనెక్షన్ల ప్రక్రియ

- జాడలేని శుద్ధియంత్రాలు
- పలు కాలనీల్లో తప్పనితిప్పలు
- చివరి దశలో పనుల నిలిపివేతతో ఈదుస్థితి
- రూ.155కోట్లకు అంచనాలు పెరిగినా నెరవేరని లక్ష్యం
- గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో యూజీడీ పనుల తీరు

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనుల తీరుపై ఆది నుంచి విమర్శల వెల్లువ కొనసాగుతూనే ఉంది. అంచనా వ్యయం రూ.155కోట్లకు పెంచినా లక్ష్యం నెరవేరడం లేదు. చివరి దశలో పనులు నిలిచిపోవడంతో పలు కాలనీల్లో ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియ నిలిచిపోయింది. మరోవైపు చాంబర్లలో మురుగును శుద్ధిచేసే జెట్టింగ్ యంత్రాలు జాడే కరువైంది. ఫలితంగా మురుగురహిత పట్టణం ప్రశ్నార్థకంగా మారింది.



మున్సిపాలిటీ పరిధిలో ఇళ్లకు యూజీడీ కనెక్షన్లు ఇస్తున్న సిబ్బంది

గజ్వేల్: మున్సిపాలిటీని మురుగు రహితంగా తీర్చిదిద్దడానికి 2018 ఆగస్టు 1న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి మాజీ సీఎం కేసీఆర్ ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) ద్వారా రూ.99 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో గజ్వేల్, ప్రజ్ఞాపూర్ గ్రామాల్లో 2020 జూన్ నెలలో 138 కిలోమీటర్ల మేర భూగర్భ మురుగునీటి పైప్‌లైన్ వ్యవస్థతో పాటు నాలుగు చోట్ల ఎస్‌టీపీ (సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ల నిర్మాణం చేపట్టారు. మొదట్లో విడుదలైన రూ.99కోట్లతో పనులతో పూర్తి కాక అంచనాలు అమాంతంగా పెంచారు. నిజానికి ముందున్న ప్రతిపాదనల్లో 138 కిలోమీటర్ల పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టాల్సి ఉండగా... కేవలం 99కిలోమీటర్ల పైప్‌లైన్ విస్తరణకే నిధులు సరిపోయాయని, పట్టణంలో ఇంకా పనులు చేపట్టాల్సిన కాలనీలు ఉన్నాయని, వీటిల్లో అంతర్గత పైప్‌లైన్లను నిర్మించాల్సి ఉన్నదని చెబుతూ అంచనా వ్యయం పెంచాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా అదనంగా రూ.56 కోట్ల నిధులు తెప్పించారు. పెంచిన నిధులతో 99కిలోమీటర్ల నుంచి 130కిలోమీటర్లకుపైగా పైప్‌లైన్ పనులు పూర్తి చేశామని అధికారులు చెబుతున్నారు. అయినా పట్టణంలోని పలు కాలనీల్లో పనులు వందశాతం పూర్తి కాలేదు. నిజానికి 9వేల పైచిలు ఇళ్లకు యూజీడీ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 8,692 కనెక్షన్లు ఇచ్చామని అధికారులు చెబుతున్నారు. దీనిని బట్టి ఇంకా 300కుపైగా ఇళ్లకు కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని నెలలుగా కొత్త కనెక్షన్ల కోసం ప్రజలు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

ఎందుకీ ఈ పరిస్థితి?

యూజీడీ పనులు చివరి దశలో నిలిచిపోవడానికి బిల్లుల చెల్లింపులో జాప్యమే కారణమని తెలుస్తోంది. పనులు పూర్తి చేయలేక సదరు కాంట్రాక్టర్ చేతులెత్తేసినట్లు తెలిసింది. ఇకపోతే...అధికారుల నిర్లక్ష్యం కారణంగా యూజీడీ పనుల తీరుపై ఆది నుంచి విమర్శలు వస్తూనే ఉన్నాయి. గతేడాది జూలై నెలలో కురిసిన వర్షాలకు పట్టణంలోని లక్ష్మీప్రసన్ననగర్, సిరిఎన్‌క్లేవ్, ప్రజ్ఞాపూర్ తదితర కాలనీల్లో మరుగు నీరు యూజీడీ చాంబర్ల నుంచి ఉబికి బయటకు వచ్చాయి. దీనివల్ల రహదారులపై దుర్గంధం వ్యాపిస్తోంది. పనుల్లో సరైన ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడింది. మరోపక్క పైప్‌లైన్ల కోసం తీసిన గుంతలు సక్రమంగా పూడ్చక పట్టణంలోని పలు కాలనీల్లో అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయి. మరో కీలకమైన అంశమేమిటంటే యూజీడీని కొన్ని నెలలుగా నిర్వహిస్తున్నారు. కానీ ఎక్కడైనా చాంబర్ల నిండితే..వాటిని క్లియర్ చేయాల్సిన జెట్టింగ్ యంత్రాలు మూడు రావాల్సి ఉంది. ఇప్పటివరకు రాకపోవడంతో చాంబర్లను క్లియర్ చేయకపోవడంతోనే ఈ దుర్గంధానికి కారణం.

పనులు వేగిరం చేయాలి



గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని మురుగు రహితంగా తీర్చిదిద్దడానికి యూజీడీ పనులు చేపట్టడం సంతోషకరమే. కానీ చివరి దశలో పనులు నిలిపేసి ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వకపోవడం సరికాదు. కొత్త కనెక్షన్ల గురించి అడిగితే అధికారుల నుంచి సరైన సమాధానం లేదు. పనులు పూర్తి చేసి, కొత్త కనెక్షన్లు కూడా ఇవ్వాలి. – డాక్టర్ కుమారస్వామి, విభాస్ సంస్థ అధ్యక్షుడు, గజ్వేల్

త్వరితగతిన పూర్తి చేస్తాం

యూజీడీ కొత్త కనెక్షన్లు సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోయిన మాట వాస్తవమే. పట్టణంలో చిన్న,చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పనులను వందశాతం పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. – కిష్టన్న, ఏఈ, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ



పరీక్షా కేంద్రం వద్ద బారులు తీరిన విద్యార్థులు

తొలిరోజు ప్రశాంతం

ఇంటర్ పరీక్షలు షురూ..

- 94 శాతం మంది విద్యార్థుల హాజరు
- 711 మంది గైర్హాజరు
- ఒక్క నిమిషం నిబంధనతో పలువురు దూరం

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు జిల్లా వ్యాప్తంగా తొలిరోజు ప్రశాంతంగా ముగిసాయి. బుధవారం మొత్తం 11,039 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 711 మంది గైర్హాజరయ్యారు. 10,328 మంది విద్యార్థులతో 94శాతం హాజరు నమోదు అయింది. 8,864 మంది జనరల్ విద్యార్థులకు గాను 8,419 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇక ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 2,175 మందికి గాను 1909 మంది విద్యార్థులు హాజరుకాగా 266 మంది గైర్హాజరయ్యారు. పలు పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతించలేదు. దీంతో వారు నిరాశతో వెనుదిరిగారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని సీపీ అనురాధ సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి, పరీక్షల కన్వీనర్ సూర్యప్రకాశ్ పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి పర్యవేక్షించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అమరేందర్‌రెడ్డి బృందం గజ్వేల్‌లోని పలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.



చంటిబిడ్డతో పరీక్ష కేంద్రానికి వస్తూ..



ఆలస్యంగా వచ్చినందుకు అనుమతించకపోవడంతో సిద్దిపేట, బెజ్జంకిలో రోదిస్తున్న విద్యార్థులు



హాల్‌టికెట్ నంబర్లను పరిశీలిస్తున్న విద్యార్థులు

అందరికీ ఆరోగ్యం ముఖ్యం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం
- కోర్టు ప్రాంగణంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహణ



న్యాయమూర్తి రఘురాంకు బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

సిద్దిపేటకమాన్: ప్రతి మనిషికి ఆరోగ్యం ముఖ్యమని ఆరోగ్యంగా ఉంటే అన్నీ ఉన్నట్లే అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం తెలిపారు. లోహిత్ సాయి ఆస్పత్రి సహకారంతో సిద్దిపేట కోర్టులో ఉచిత హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఉచిత హెల్త్ క్యాంప్‌లు నిర్వహించడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. మెగా హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటిస్తూ వ్యాయామం చేయాలన్నారు. క్యాంపులో బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, కక్షిదారులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు స్వాతిరెడ్డి, చందన, శ్రావణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఆసుపత్రి వైద్యులు డాక్టర్ భాస్కర్, వైద్యులు శ్రీనివాస్, సతీష్, స్వప్న, శిరీష, మేనేజర్ తిరుపతిరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థీకృత హింస తగ్గాలి

మకాం సంస్థ జాతీయ నాయకురాలు డాక్టర్ రుక్మిణి

సిద్దిపేటజోన్: మహిళలపై వ్యవస్థీకృత హింస తగ్గాలని మకాం సంస్థ జాతీయ నాయకురాలు డాక్టర్ రుక్మిణి రావు అన్నారు. బుధవారం స్థానిక టీటీసీ భవన్ లో వ్యవసాయ సంక్షోభం, మహిళా రైతులపై వ్యవస్థీకత హింస అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలలో సర్వే, అధ్యయనం చేస్తున్నట్టు పేర్కొన్నారు. వ్యవసాయంలో పనిచేస్తున్న మహిళలు, కుటుంబంలో, పని చేసే స్థలాల్లో ఎదుర్కొంటున్న వేధింపులు, హింస రూపాలు వాటి స్వభావం, వ్యవసాయ సంక్షోభానికి మధ్య ఉన్న సంబంధం, ప్రభుత్వ పథకాల్లో వివక్ష గూర్చి అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. అధ్యయనం తర్వాత అంశాలను ప్రభుత్వం వద్దకు తీసుకెళ్లి అవసరమైన విధాన మార్పుల కోసం సంస్థ పని చేస్తుందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతుల ఆత్మహత్యలు అధికంగా జరగడం, మహిళా రైతుల ఇబ్బందులపై అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, సంస్థ నాయకులు ఆశాలత, సీతా లక్ష్మి, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కొండల్ రెడ్డి పద్మ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే దేశ ఆర్థికాభివృద్ధి

- డీఎస్‌ఓ కల్లెపల్లి శ్రీనివాస్
- మిరుదొడ్డిలో ఘనంగా నేషనల్ సైన్స్‌డే

మిరుదొడ్డి(దుబ్బాక): సైన్స్‌తోనే దేశ ఆర్థికాభివృద్ధి సాధ్య పడుతుందని డీఎస్ఓ (డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్) కల్లెపల్లి శ్రీనివాస్ అన్నారు. మిరుదొడ్డి మోడల్ స్కూల్‌లో బుధవారం నేషనల్ సైన్స్ డే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సర్ సీవీ రామన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి జ్యోతి వెలిగించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సైన్స్ ఎగ్జిబిట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువగా శాస్త్రవేత్తలు కలిగిన దేశాలు ఆర్థికాభివృద్ధితో పాటు అగ్రరాజ్యాలుగా వెలుగొందుతున్నాయన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి నేషనల్ సైన్స్ డేలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. సైన్స్‌పై అవగాహన కలిగిన ప్రతి విద్యార్థి విజ్ఞాన వంతమైన అంశాలను కనుగొనడానికి అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తులో శాస్త్రజ్ఞులుగా అవతరించడానికి విద్యార్థి దశ కీలకంగా మారుతుందన్నారు. ఆ దిశగా విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి పాటుపడాలన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌ఛార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మోడల్ స్కూల్‌లో నిర్వహించిన నేషనల్ సైన్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మోడల్ స్కూల్ విద్యార్థుల మౌళిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 27 లక్షల నిధుల మంజూరు పత్రాలను స్కూల్ ప్రిన్సిపాల్ భారతీ దేవికి అందించారు. కార్యక్రమానికి ముందు విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ జోగు ప్రభుదాసు, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. వెంకట రామలింగం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మిరుదొడ్డి మోడల్ స్కూల్‌లో నేషనల్ సైన్స్ డే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎస్ఓ శ్రీనివాస్

నిత్య జీవితంలో ఎంతో ఉపయోగం

హుస్నాబాద్: నిత్య జీవితంలో సైన్స్ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రకృతి విసిరే సవాళ్లను అధిగమించి పరిష్కారాలను చూపిస్తూ మానవాళి అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి హాజరై శాస్త్రవేత్తల ఫొటోలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూతన పరిష్కారాలను చూపిస్తూ శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శాస్త్రవేత్తల ఫొటోలను ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

ఆస్పత్రిలో ఆర్తనాదాలు

- క్షతగాత్రులకు సిద్దిపేటలో చికిత్స
- రాంపూర్ వద్ద రోడ్డు ప్రమాదం
- అక్కడికక్కడే ముగ్గురి మృతి
- ఎనిమిది మందికి గాయాలు
- క్షతగాత్రుల్లో ఆరుగురు చిన్నారులు
- మార్చురీ, ఆస్పత్రి పరిసరాల్లో మిన్నంటిన రోదనలు

సిద్దిపేటకమాన్: పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి క్షతగాత్రుల రోదనలు, బంధువుల ఆర్తనాదాలతో అట్టుడికిపోయింది. నంగునూరు మండలం రాంపూర్‌లో బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. గాయపడిన క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి వైద్యులు, సిబ్బంది వైద్య చికిత్స అందించారు. ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురి మృతదేహాలను ట్రాక్టర్‌లో తరలించి మార్చురీకి తరలించారు. దీంతో మార్చురీ వద్ద, ఆసుపత్రి ప్రాంగణంలో మృతిచెందిన, గాయపడిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఆర్తనాదాలతో దద్దరిల్లింది. మృతదేహాలపై పడి కుటుంబ సభ్యులు పడి రోదించిన తీరు అక్కడ ఉన్న వారిని కంటతడి పెట్టించింది. గాయపడిన క్షతగాత్రులకు వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి ఎక్స్‌రే, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. కారులో ఆరుగురు చిన్నారులతో కలిసి మొత్తం పది మంది ప్రయాణిస్తున్నట్లు తెలుస్తోంది. చిన్నారులతో పాటు తీవ్ర గాయాలైన బాధితులకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న సమయంలో అసలు ఎం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కుటుంబ సభ్యులు బాబాయి, పిన్ని, అన్నయ్య, చిన్ని, నాని అంటూ ఏమైందిరా అంటూ రోదించారు.గాయపడిన దుద్దెడ గ్రామానికి చెందిన న్యాన్సీ(2), కీర్తన(35), భానుప్రసాద్(11), ప్రణయ్(8), చరణ్(11), వైష్ణవి(6), హాన్విక(8నెలలు), బాపురాజు(33), మరో వ్యక్తికి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు.

విషమంగా ఉన్నవారిని..

వీరిలో విషమంగా ఉన్న ఇద్దరు పిల్లలతో పాటు మరో మహిళను గాంధీ ఆసుపత్రికి రిఫెర్ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. ప్రభుత్వాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సైకియాట్రి విభాగ హెచ్‌ఓడీ డాక్టర్ శాంతి, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత దగ్గరుండి క్షతగాత్రులకు భరోసా కల్పిస్తూ వైద్య సిబ్బంది చేత చికిత్స అందేలా చూశారు. పిల్లల విభాగ వైద్యుడు కోట వేణు పిల్లలను పరీక్షించి వైద్య చికిత్స అందించారు.



సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలో మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



గాయపడిన చిన్నారులను చేతులపై తీసుకువస్తున్న కుటుంబసభ్యులు



భార్య మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త

క్లుప్తంగా

జాతీయస్థాయిలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పటాన్‌చెరు టౌన్: అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు 15 రాష్ట్రాల నుంచి 64 ప్రాజెక్టులు ఎంపిక చేసుకొని జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను జూమ్ ద్వారా నిర్వహించారు. ఇందులో పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ప్రభుత్వ పాఠశాల 7,8 వ తరగతి విద్యార్థులైన ఉజ్జీవన్, జీవన్ కుమార్ ఎలాంటి ఖర్చు లేకుండా వృథాగా పడి ఉన్న వస్తువులను ఉపయోగించి తయారు చేసిన ×లెమన్ కట్టర్‌®ని వైజ్ఞానిక ప్రదర్శనలో చూపించారు. వీరి ప్రదర్శన ద్వితీయ బహుమతి గా ఎంపిక కావడంతో పాటు రూ. 12 వేల నగదు పొందినట్లు ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

సైన్స్‌ను కెరీర్‌గా ఎంచుకోండి

నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ గ్రెగ్ ఎల్.సెమెంజా

పటాన్‌చెరు : సైన్స్ (శాస్త్రం) ఎన్నో ఆవిష్కరణలకు బాటలు వేసి, మానవ జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహద పడుతుందని వర్ధమాన శాస్త్రవేత్తలు, విద్యార్థులకు నోబెల్ బహుమతి గ్రహీత, జాన్స్ హాప్కి స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లోని జెనిటిక్ మెడియస్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ గ్రెగ్ ఎల్.సెమెంచాతో సూచించారు. 'రామన్ ఎఫెక్ట్' ఆవిష్కరణను పురస్కరించుకొని పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'భారతదేశ అభివృద్ధి కోసం దేశీయ పరిజ్ఞానం' అనే ఇతివృత్తంతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రెగ్ మాట్లాడుడూ.. ముందుగా ఒక ఆలోచనతో ముందుకొచ్చి, దానిని పరీక్షించమని ఆయన సలహా ఇచ్చారు. ఇవన్నీ సొంత సృజనాత్మకత, మనం చేసే ఆలోచన నుంచి ఆధారపడి ఉంటాయని వివరించారు. అనంతరం గీతం అదనపు ప్రొఫెసర్ డీఎస్ రావు నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ గ్రెగ్ ఎల్.సెమెంజాను సన్మానించి, జ్ఞాపకం అందజేశారు.

కాలునొప్పి బాధ భరించలేక..

గృహిణి ఆత్మహత్య

వర్గల్(గజ్వేల్): ఉరేసుకొని గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం వర్గల్ మండలం వేలూరులో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వేలూరుకు చెందిన కాయిత రాజు, రాధ(33) దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. నాలుగేళ్ల కిందట పొలంలో పని చేస్తున్న రాధ కాలుకు ట్రాక్టర్ తగిలి కాలు విరిగింది. ఆపరేషన్ చేసి రాడ్ వేశారు. 20 రోజుల కిందట మరోసారి ఆపరేషన్ చేసి రాడ్ తొలగించారు. అప్పటి నుంచి ఆమె కాలు నొప్పితో బాధపడుతుంది. మంగళవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు భోజనం చేసి నిద్రపోయారు. అర్థరాత్రి నిద్రలేచిన భర్తకు ఓ గదిలో రాధ ఉరేసుకొని విగత జీవిగా కన్పించింది. భార్య కాలు నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుందని రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనగనగా ఈ రోజు..

లీపు సంవత్సరం రోజున పెళ్లి, బర్త్ డేలు

కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య సంబురాలు

అందరిలోనూ వీరు ప్రత్యేకం

నాలుగేళ్లకోసారి జరుపుకోనున్న వేడుకలు

హ్యాపీ లీప్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

నాలుగేళ్లకోసారి వచ్చే లీపు సంవత్సరం (ఫిబ్రవరి 29) అంటే అందరూ ప్రత్యేక రోజుగా పరిగణిస్తారు. ఇక ఆ రోజు పెళ్లి, పుట్టిన రోజు చేసుకోవడం అంటే మరీ స్పెషల్. వారి వేడుక జరుపుకోవడానికి నాలుగేళ్లు ఎదురుచూడడం కాస్త బాధగా ఉన్నా.. ఆ రోజు వచ్చిందంటే చాలు కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య చెప్పలేని ఆనందంతో సంబురాలు చేసుకుంటారు. గురువారం లీపు సంవత్సరం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం...



రెండు గ్రామాల్లోనూ స్పెషల్..



నూతన మధూవరులు నరేశ్, అశ్విని

దుబ్బాకటౌన్: దుబ్బాక మండలం పెద్ద చీకోడ్‌కు చెందిన పున్న నరేశ్‌కు కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్‌గా గ్రామానికి చెందిన అశ్విని లీప్ సంవత్సరం రోజునే వివాహ బంధంలోకి అడుగుపెడుతున్నారు. ఫిబ్రవరి 29నే ముహూర్తం రావడంతో ఇందుకు ఇరు కుటుంబాల వారు ఒప్పుకున్నారు. గురువారం బొమ్మకల్‌లో వివాహం జరుగనుంది. నాలుగేళ్లకోసారి వచ్చే లీపు సంవత్సరం రోజు పెళ్లి జరగడం రెండు గ్రామాల్లోనూ ప్రత్యేక ఆకర్షణగా మారింది.

అప్పట్లో తేదీలు చూడకుండానే..



మల్లం శ్రీనివాస్, కవిత దంపతులు

కొమురవెల్లి(సిద్దిపేట): ఈ ఫొటోలో కనిపిస్తున్న దంపతుల పేరు మల్లం శ్రీనివాస్ కవిత. వీరిది మండలంలోని అయినాపూర్ గ్రామం. వీరి వివాహం 2004 ఫిబ్రవరి 29న జరిగింది. ఆ రోజు తేదీ చూడకుండా ముహూర్త బలం చూసి పెద్దలు పెళ్లి చేశారు. ప్రతీ నాలుగేళ్లకోసారి పెళ్లి రోజు జరుపుకుంటున్నారు. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. వారి ఎంతో సంతోషంగా ఉందని దంపతులు చెప్పుకొచ్చారు.

తెలిసినా.. ఒప్పుకున్నాం



మానస, అభిషేక్ (నూతన వధూవరులు)

ఈ ఫొటోలో కనిపిస్తున్న మానస అభిషేక్‌ల వివాహం నేడు (గురువారం) జరుగనుంది. మానసది మండలంలోని మత్రిముచ్చాల గ్రామం. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నారు. వీరిది పెద్దలు కుదిర్చిన వివాహం. పెళ్లి ఫిబ్రవరి 29న వస్తుందని, ప్రతీ సంవత్సరం కాకుండా నాలుగేళ్లకోసారి పెళ్లిరోజు జరుపుకోవాల్సి వస్తుందని తెలుసు. కానీ 29న ముహూర్తం మంచిగా ఉండడంతో ముహూర్తానికి ప్రాధాన్యత ఇచ్చి వివాహం చేసుకుంటున్నారు.

నా ఫ్రెండ్స్‌లో నేను ఒక్కడినే..



శ్రావణ్‌రెడ్డి

నారాయణఖేడ్: తోటి మిత్రులు, బంధువుల్లో ఎవరికీ లేని స్పెషలే నా బర్త్‌డే.. నాలుగేళ్లకోమారు వచ్చే బర్త్ డే అంటే ఎంతో ఇష్టం.. నా బర్త్‌డే కోసం నాలుగేళ్లు ఎదురుచూస్తుంటా అని నాగల్‌గిద్ద మండలం వల్లూరు గ్రామానికి చెందిన శ్రావణ్‌రెడ్డి తెలిపారు. తల్లిదండ్రులు నవనీత, చంద్రశేఖర్‌రెడ్డిలు నారాయణఖేడ్‌లో నివాసం ఉంటారు. 6వ తరగతి చదువుతున్న శ్రావణ్‌రెడ్డి 2012 ఫిబ్రవరి 29న జన్మించాను. ఇప్పటి వరకు మూడు బర్త్‌డేలు చేసుకున్నాను. ఇది నాలుగవ బర్త్‌డే. స్పెషల్‌గా ఉన్న లీప్ ఇయర్ బర్త్‌డే అంటే ఎంతో సంతోషంగా ఉందటూ చెప్పుకొచ్చాడు.

నాలుగేళ్లకోసారి జరుపుకొంటాం



సుప్రియ, రాకేష్‌రెడ్డి వధూవరులతో తల్లిదండ్రులు

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలం మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన బాన్స్‌వాడ చంద్రకళ, భూపాల్‌రెడ్డి దంపతుల కూతురు సుప్రియ వివాహం హైదరాబాద్ కొంపల్లికి చెందిన మంజుల, శేక్‌రెడ్డి కుమారుడు రాకేష్‌రెడ్డితో ఈనెల 29న లీపు సంవత్సరం రోజున జరుగనుంది. సుప్రియ హైదరాబాద్‌లో సీఏ పూర్తి చేసి ప్రస్తుతం ఉద్యోగం చేస్తుంది. రాకేష్‌రెడ్డి సైతం సీఏ పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నాడు. వీరి పెళ్లి పెద్దలు కుదిర్చారు. 29న పెళ్లి ముహూర్తం బాగుందని చెప్పడంతో ఇరుకుటుంబాలు పెద్దలు, బంధువులు ఒప్పుకున్నారు. కలిసి జీవించే వాళ్లం కాబట్టి ముహూర్తాలకే ప్రాధాన్యం ఇచ్చాం పెళ్లి వార్షికోత్సవం నాలుగేళ్ల తర్వాత ఘనంగా జరుపుకుంటామని నూతన దంపతులు చెప్పుకొచ్చారు.

ఊరంతా భోజనాలు



అమ్మ, నాన్నతో సాన్విక

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట 8 వార్డు కౌన్సిలర్ దుబ్బాక బాలకృష్ణ గౌడ్ నవత దంపతులకు 2020 సంవత్సరం ఫిబ్రవరి 29న అమ్మాయి సాన్విక జన్మించింది. 2020 లీపు సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా బర్త్ డే వేడుకలు జరుపుకోలేదు. దీంతో ఆ దంపతులు లీపు సంవత్సరం కోసం ఎదురుచూస్తున్నారు. 2024లో మళ్లీ ఫిబ్రవరి 29 లీపు సంవత్సరం కావడంతో నాలుగురెట్ల ఆనందంతో బర్త్ డే వేడుకలు జరపడానికి ఏర్పాట్లు చేశారు. ప్రతీ సంవత్సరం వేడుకలు జరుపుకోకపోవడం బాధగా ఉన్నా నాలుగేళ్లకు ఒక్కసారి ఊరంతా భోజనాలు పెట్టి ఆనందోత్సవాల నడుమ వేడుకలు చేయడం సంతోషంగా ఉందని బాలకృష్ణ గౌడ్ దంపతులు తెలిపారు.

12 ఏళ్లలో ఇది మూడోసారి..



బెజ్జంకి(సిద్దిపేట): లీపు సంవత్సరం అంటేనే ఒక థ్రిల్లింగ్.. ఆ రోజున పుట్టిన రోజు వేడుకంటే మరో స్పెషల్‌గా మారింది. నాకే కాకుండా కుటుంబ సభ్యులతో పాటు పాఠశాలలోని తోటి విద్యార్థులు నా జన్మదినాన్ని ప్రత్యేకంగా చెప్పుకుంటారు. 2012 నుంచి 12 ఏళ్లలో రెండుసార్లు జన్మదిన వేడుకలు జరుపుకున్నాను. ఇది మూడవ పుట్టినరోజు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 29 రావడం ఎంతో ఆనందంగా ఉంది.

– రామంచ రచన, 7వ తరగతి

నేడు ఒక్కటి కానున్న జంట



శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేటకు చెందిన అరిగె నాగరాజు చిన్నశంకరంపేట చెందిన వెన్నెలతో పెళ్లి నిశ్చయమైంది. ప్రత్యేకంగా ఫిబ్రవరి 29 (లీపు సంవత్సరం)న పెళ్లి చేసేందుకు ఇరు కుటుంబాల పెద్దలు ముందుకొచ్చారు. అందుకు అనుగుణంగా గురువారం పెళ్లి జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. నాలుగేళ్లకోసారి ఘనంగా పెళ్లి వేడుకలు జరుపుకుంటామని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రత్యేక రోజుతోపాటు మంచి ముహూర్తం కావడంతో చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముహూర్త బలం చూసి..



నూతన వధూవరులు నర్సింలు, శిరీష

పెళ్లి ముహూర్తమే ముఖ్యం అందుకే ముహూర్త బలం బాగుందని చెప్పడంతో 29న పెళ్లి చేసుకుంటున్నట్లు కౌడిపల్లి మండల రాయిలాపూర్ గ్రామానికి చెందిన పెళ్లి కొడుకు మన్నె నర్సింలు తెలిపారు. రాయిలాపూర్ గ్రామానికి చెందిన మన్నె శాంతమ్మ -అంజయ్య కుమారుడు నర్సింలు వివాహం కొల్చారం మండలం అంసాన్‌పల్లి గ్రామానికి చెందిన తమ్మలి లక్ష్మీ-ఆశయ్య కూతురు శిరీషతో గురువారం జరుగనుంది. నాలుగేళ్లకోసారి వచ్చే లీపు సంవత్సరం అయినప్పటికీ ముహూర్తమే ముఖ్యమని అందుకే పెళ్లి చేసుకుంటున్నట్లు చెప్పారు. అంతగా కావాలంటే తిథులు ఆధారంగా ప్రతీ సంవత్సరం వార్షికోత్సవం జరుపుకునే అవకాశం ఉంది.

మళ్లీ ఇదే సంతోషంతో..



వట్‌పల్లి(అందోల్): నాలుగేళ్లకోసారి ఫిబ్రవరి 29వ తేదీన వివాహం చేసుకోవడమంటే మళ్లీ నాలుగేళ్ల తర్వాతే పెళ్లి రోజు చేసుకోవడం సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉంటుంది. 29వ తేదీన బలమైన ముహూర్తంతోపాటు సమ్‌థింగ్ స్పెషల్ డేగా ఉంటుందని మా కుటుంబ సభ్యులతో మాట్లాడి మేము ఈ రోజును ఎంచుకున్నాం. మా పెళ్లి వేడుక నాలుగేళ్ల వేడుకగా మారుతుండడంతో సంతోషంగా ఉంది. అదే సంతోషంతో నాలుగేళ్ల తర్వాత జరుపుకుంటాం.

– మంగళి రమేశ్, భవానీ, దేవునూర్

44 ఏళ్లు.. పది సార్లు



నా పేరు దేవునూరి కృష్ణ. మాది అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామం. ప్రతి ఒక్కరు ఏడాదికోసారి పుట్టిన రోజు జరుపుకుంటారు. కానీ నేను నాలుగేళ్లకోసారి జరుపుకోవడం థ్రిల్లింగ్‌గా ఉంది. మా పిల్లలు డాడీ నీ బర్త్‌డే ఎప్పుడూ అని అడుగుతుంటారు. నా బర్త్‌డే నాలుగేళ్లకోసారి వస్తుందని చెప్పగానే అందేంటని వారు ఆశ్చపోతున్నారు. నేను 1980 ఫిబ్రవరి 29న జన్మించాను. నా వయస్సు 44 ఏళ్లు. 10 సార్లు మాత్రమే పుట్టిన రోజు జరుపుకున్నా.

– దేవునూరి కృష్ణ, కన్‌సాన్‌పల్లి

మూడో బర్త్‌డే..



అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన నోమన్నగారి సురేందర్‌రెడ్డి, సుప్రియ దంపతుల కుమారుడు కౌశిక్‌రెడ్డి. అందరిలా ఏడాదికోకసారి కాకుండా నాలుగేళ్లకోసారి బర్త్‌డే జరుపుకుంటాడు. 2012 ఫిబ్రవరి 29న జన్మించిన ఆయన ఇప్పటి వరకు రెండు సార్లు మాత్రమే పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నాడు. గురువారం మూడో బర్త్‌డే చేసుకోనున్నాడు. నాలుగేళ్లకోసారి జరుపుకోవడం సంతోషంగా ఉందన్నాడు.

మర్చిపోలేని రోజు..



జోగిపేట(అందోల్): మంచి ముహూర్తం ఉండడంతో ఫిబ్రవరి 29న (గురువారం పెళ్లి చేసుకోబోతున్నాం. అందరూ సంవత్సరానికి ఒక్కసారి పెళ్లి రోజు వేడుకలు జరుకుంటే మేము మాత్రం నాలుగేళ్లకోసారి జరుపుకోవాలి. అందరికంటే భిన్నంగా ఉండాలనే ఈ రోజు పెళ్లి పెట్టుకున్నాం. నాలుగేళ్లకోసారి మా పెళ్లిరోజు వస్తుందని తెలిసినా మంచి ముహూర్తం, సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉంటుందనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. మా పెళ్లిరోజును ఉత్సాహంగా కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకొంటాం.

- సిలారపు త్రిష, మణికంఠ (మంత్రి దామోదర రాజనర్సింహ కూతురు)

పదకొండవ బర్త్ డే



డాకూర్ గ్రామానికి చెందిన ముప్పారం పద్మారావు 1980 ఫిబ్రవరి 29న జన్మించాడు. 44 ఏళ్లు ఉన్న ఇతను పది సార్లు మాత్రమే జన్మదినాన్ని జరుపుకున్నాడు. సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టుగా పని చేస్తున్న పద్మారావు పదకొండవ జన్మదినాన్ని స్నేహితులు, సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య గురువారం జరుపుకోవడానికి సిద్ధమయ్యాడు. నాలుగేళ్లకోసారి వచ్చే జన్మదినాన్ని ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉంది.

- ముప్పారం పద్మారావు, జూనియర్ ఆర్టిస్ట్, డాకూరు గ్రామం

మొదట్లో బాధపడేవాడు



వినయ్ తేజ్

ఈ అబ్బాయి ఫిబ్రవరి 29, 2016వ సంవత్సరంలో జన్మించాడు. మా కుమారుడి పుట్టిన రోజు నాలుగేళ్లకోసారి వస్తుందని కొంత బాధగా ఉన్నా అందరూ గుర్తు పెట్టుకునేంత ప్రత్యేక దినం కావడంతో తాము అదృష్టంగా భావిస్తున్నాం. నా కుమారుడి పేరు మన్నె వినయ్ తేజ్. వాడి తెలివి వచ్చిన తర్వాత మమ్మీ నా బర్త్‌డే ప్రతీ సంవత్సరం ఎందుకు చేయడం లేదని అడిగే వాడు. అప్పుడు అతడికి నీ బర్త్ డే నాలుగేళ్లకోసారి వస్తుందని చెప్పాం. మొదట్లో బాధ పడ్డా రాను రాను అలవాటు చేసుకున్నాడు.

- మన్నె రాజమల్లయ్య, అర్చన (వినయ్ తేజ్ తల్లిదండ్రులు)

అదృష్టంగా భావిస్తున్నా ..



పుట్టినరోజు జరుపుకొంటున్న చంటి (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): ఫిబ్రవరి 29న జన్మించడం అదృష్టంగా భావిస్తున్నానని పట్టణంలోని 3వ వార్డు కౌన్సిలర్ మంగోలు చంటి అన్నారు. 1992 సంవత్సరంలో ఫిబ్రవరి 29న జన్మించిన చంటి గడిచిన ఏడు జన్మదినాలను కుటుంబ సభ్యుల మధ్య జరుపుకున్నారు. గురువారం 8వ జన్మదినాన్ని కౌన్సిలర్ హోదాలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో జరుపుకోనున్నట్లు తెలిపారు.

జాగిలాల పనితీరు ప్రశంసనీయం

సిద్దిపేట సీపీ అనురాధ



నూతన పోలీసు జాగిలాలతో సీపీ అనురాధ, డాగ్ స్క్వాడ్ సిబ్బంది

సిద్దిపేటకమాన్: నేరస్తులను పసిగట్టడంలో పోలీసు జాగిలాల పనితీరు ప్రశంసనీయమని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ శిక్షణ కేంద్రంలో శిక్షణ ముగించుకున్న రెండు నూతన పోలీసు జాగిలాలు రానా, సిరిలను సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌కు సిబ్బంది తీసుకొచ్చారు. పోలీసు జాగిలాలను సీపీ ఎదుట హాజరుపర్చగా వాటిని పరిశీలించి శిక్షణ, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రస్తుతం జాగిలాల సంఖ్య తొమ్మిదికి చేరుకుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ రామచంద్రరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, ఆర్ఎస్ఐ రోహిత్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది భాను, నవీన్, వెంకటేశ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధమే కారణం

- నల్తూరు వాసి దారుణంగా హత్య
- నలుగురు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని మాదారం శివారులో ఇటీవల ఓ వ్యక్తి మృతి చెంది ఉన్న విషయం తెలిసిందే. గుర్తు తెలియని వ్యక్తి, అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లుగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు వివాహేతర సంబంధమే హత్యకు కారణంగా నిర్ధారించారు. బుధవారం సీఐ నయీముద్దీన్ కథనం ప్రకారం.. జిన్నారం మండలంలోని నల్తూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్(34) వడక్‌పల్లి గ్రామానికి చెందిన ఓ వివాహితతో వివాహేతర సంబంధం ఉంది. అప్పుడప్పుడూ రహస్యంగా కలుసుకునే వారు. ఆదివారం రాత్రి వడక్‌పల్లిలో ఆమె ఇంటికి వెళ్లాడు. మహిళతో శ్రీకాంత్ ఉన్న విషయాన్ని కుటుంబ సభ్యులు గుర్తించి దాడి చేశారు. మహిళ తండ్రి పోచయ్య, అన్న రవి, మామ రాములు, బావ విక్రమ్ చేసి కట్టెలతో తలపై బలంగా చితకబాదడంతో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని కారులో తీసుకొచ్చి మాదారం శివారులోని ఓ బ్రిడ్జి సమీపంలో పడేశారు. శ్రీకాంత్ మృతికి కారణమైన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించి ఛేదించినందుకు పోలీసులను అభినందించారు.

వేసిన వలే మృత్యుపాశమై

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి



ప్రభు మృతదేహం

కౌడిపల్లి(నర్సాపూర్): చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన కౌడిపల్లి మండలం కొట్టాల గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం ఎస్ఐ రంజిత్‌రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొడకండ్ల ప్రభు(42) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లాడు. రాత్రి గడిచినా రాకపోవడంతో కుటుబ సభ్యులు గ్రామంలో వెతికారు. బుధవారం ఉదయం స్థానిక చౌదరి చెరువు కట్టపైన ప్రభు బట్టలు, చెప్పులు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు చెరువులో వెతకగా ప్రభు మృతదేహం లభ్యమైంది. చెరువులో చేపలు పట్టేందుకు వచ్చి ప్రమాదవశాత్తు అతను వేసిన వల చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడని తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భెల్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ..

- రూ.5.40 లక్షలు వసూలు
- నకిలీ పత్రాలు చూపెట్టి ఉద్యోగి మోసాలు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ పరిశ్రమలో కాంట్రాక్టు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నకిలీ పత్రాలను చూపెట్టిన మోసం చేసిన భెల్ కార్మికుడిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. భెల్ కాలనీలో నివాసముండే సత్య సీల్ 2010లో భెల్ పరిశ్రమలో కార్మికుడిగా ఉద్యోగంలో చేరాడు. 6 నెలల కిందట ఎమ్ఐజీ కాలనీలో నివాసముండే విట్టల్ రెడ్డితో స్నేహాన్ని ఏర్పరుచుకొని, పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించాడు. నకిలీ పత్రాలు చూపించి అతడి వద్ద డబ్బులు వసూలు చేశాడు. ఈ రకంగా ఏడుగురి నుంచి రూ.5 లక్షల 40 వేలు వసూలు చేశాడు. ఎంతకీ ఉద్యోగం ఇప్పించకపోవడంతో విట్టల్ రెడ్డి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీస్ దర్యాప్తులో సత్యసీల్ మోసాలన్నీ బయటపడ్డాయి. కాలనీలో సినిమా షూటింగ్‌లు జరుగుతుండడంతో అక్కడికి వెళ్లి షూటింగ్ కోసం వచ్చిన వారికి మాయమాటలు చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్నట్లు విచారణలో తేలింది. 2022లో పరిశ్రమల్లో కాపర్ వైర్ దొంగిలించి జైలుకు వెళ్లినట్లు పోలీసులు వివరించారు. సత్యసీల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పాపడ్ ప్యాకెట్లలో పురుగులు



తనిఖీలు చేస్తున్న అధికారులు

నారాయణఖేడ్: పట్టణంలోని ఎస్ఆర్ఆర్ మార్ట్‌లో పురుగులతో ఉన్న పాపడ్లు (బొంగులను) విక్రయిస్తున్నారని వినియోగదారులు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి మార్ట్‌లో పాపడ్లు కొనుగోలు చేయగా అందులో పురుగులు ఉన్నాయి. మాల్ నిర్వాహకులను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్, సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. దుకాణంలోని బస్తాల్లో నిల్వ ఉన్న పాపడ్‌లలో పురుగులు ఉన్నట్లు గుర్తించారు. మొదటి తప్పుగా భావించి రూ.5 వేలు కాంపౌండ్ ఫీజుగా వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.